టీబీఎస్ఎస్ అధ్యక్ష పదవికి రమణారావు రాజీనామా



నల్లకుంట: తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి (టీబీఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు పోచంపల్లి రమణారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దశాబ్దంన్నర కాలంగా తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షుడు దివంగత గంగు భానుమూర్తి, సోదర సమానుడైన టీబీఎస్ఎస్ గౌరవ అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ సహకారంతో ఇంత కాలం బ్రాహ్మణ సమాజానికి సేవలు అందించిన తాను ఈ పదవి నుంచి తప్పుకోవడం కొంత వరకు బాధగా ఉందన్నారు. తాను పదవికి రాజీనామా చేసినప్పటికి తెలంగాణ బ్రాహ్మణ సమాజం కోసం తన వంతు కృషి చేస్తానని చెప్పారు. తన రాజీనామాను ఆమోదించి తన స్థానంలో వేరొకరికి అధ్యక్ష బాధ్యతలు అప్పగించాలని గంగు ఉపేంద్రశర్మను కోరారు. తన శ్రేయోభిలాషులతో చర్చించి త్వరలోనే తదుపరి కార్యాచరణ ప్రకటిస్తానని తెలిపారు.

ఉపాధ్యాయులు సమాజానికి ఆదర్శం

చిక్కడపల్లి: ఉపాధ్యాయులు సమాజానికి ఆదర్శమని శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం త్యాగరాయ గానసభలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఆచార్య దేవోభవ కార్యక్రమంలో భాగంగా కవి సమ్మేళనం నిర్వహించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రదానం జరిగింది. అనంతరం ఇనాక్ మాట్లాడుతూ... ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన రాధాకృష్ణన్ అందరికి ఆదర్శప్రాయుడని అన్నారు. ఈ కార్యక్రమంలో డా. రామ్మోహన్‌రావు, దామోదర్‌గుప్తా, దైవజ్ఞశర్మ, ఎం.శాంతికుమారి, కృష్ణవేణి, వేణుగోపాల్‌శర్మ, రామచంద్రరావు, రాధ కుసుమ, మురళీమోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనోత్సవ సహకరించిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు

చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ రాజునాయక్

చిక్కడపల్లి: ప్రశాంతంగా వినాయక చవితి నవ రాత్రులు జరిగేలా సహకరించిన మండపాల నిర్వాహకులు, ప్రజలకు చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ కృతజ్ఞతలు తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వినాయక విగ్రహాలను వినాయకసాగర్‌లో నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అదనపు పోలీసు బలగాలచే తగిన విధంగా గట్టి బందోబస్తు చర్యలు సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పావల్లి, చిక్కడపల్లి ఏసీపీ ఎల్.రమేష్‌కుమార్ నేతృత్వంలో చేపట్టామన్నారు. డీఐ శంకర్, అడ్మిన్ ఎస్సై అభిలాష్, ఎస్సైలు మౌనిక, శివప్రసాద్, కరీం పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడికి శుభాకాంక్షలు



అంబర్‌పేట: టీపీసీసీ అధ్యక్షుడిగా ఏడాది పూర్తి చేసుకున్న మహేష్ కుమార్‌గౌడ్‌కు పలువురు కాంగ్రెస్ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం గాంధీభవన్‌లో కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఖైరాబాద్ జిల్లా కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్ పాల్గొన్నారు.

కాచిగూడ డివిజన్‌లో ప్యాచ్‌వర్క్ చేపట్టండి



కాచిగూడ: గుంతలు పడ్డ రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కాచిగూడ కార్పొరేటర్ ఉమారాణి అధికారులకు సూచించారు. సోమవారం కాచిగూడ డివిజన్ చెప్పల్‌బజార్, రహమత్‌నగర్, దశరథ లేన్ తదితర ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బందితో కలిసి ఆమె పర్యటించారు. గుంతలు పడ్డ రోడ్లను పరిశీలించారు. వెంటనే ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఈ ప్రవీణ్, ఏఈ ప్రశాంత్, బీజేపీ నేతలు వాసు, బి.భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, ఓంప్రకాష్, రాజ్‌కుమార్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... గుర్తుతెలియని మహిళ (55) శివరాంపల్లి – బుద్వేల్ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిర్మించి.. వదిలేసి!

పోకిరీలకు అడ్డాగా నారాయణగూడ మోడల్ మార్కెట్

- వృథా అవుతున్న రూ.కోట్లాది ప్రజాధనం
- మార్కెట్ భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలి: కాచిగూడ కార్పొరేటర్ ఉమారాణి



నారాయణగూడ చౌరస్తాలో మోడల్ మార్కెట్

కాచిగూడ: ప్రజావసరాలకు అనుగుణంగా తగినన్ని మోడల్ మార్కెట్లు నిర్మిస్తామని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించింది. నగరంలో కనీసం 200 మోడల్ మార్కెట్లు నిర్మించాలని భావించిన జీహెచ్ఎంసీ అధికారులు ఆ మేరకు ప్రయత్నాలు చేశారు. అందులో భాగంగా నారాయణగూడ చౌరస్తాలో దాదాపు రూ.3.5కోట్ల బడ్జెట్‌తో గ్రౌండ్ ప్లస్ నాలుగు అంతస్తుల్లో సంవత్సరం క్రితం మోడల్ మార్కెట్‌ను నిర్మించారు. సదాశయంతో నిర్మించిన మోడల్ మార్కెట్ వృథాగా పడి ఉంది. అధికారుల నిర్లక్ష్యంతో నిర్వహణ కరువై.. చెత్తాచెదారం నిండిపోయి.. మందుబాబులు, పోకిరీలకు అడ్డాగా మారింది.



మోడల్ మార్కెట్ రోడ్డుకు ఇరువైపుల రోడ్లపై కొనసాగుతున్న వ్యాపారాలు

గాడి తప్పిన లక్ష్యం...

గ్రేటర్‌లోని ప్రజలకు ఎక్కడి వారికి అక్కడే చిన్నపాటి సూపర్‌మార్కెట్లలా మోడల్ మార్కెట్లు ఉపయోగపడాలనేది అప్పటి ప్రభుత్వ ఆలోచన. కానీ... వాటిని నిర్మించే ముందు అవి నిజంగా ప్రజలకు దగ్గరలో అందుబాటులో ఉన్నాయా లేదా అన్నది పట్టించుకోలేదు. లక్ష్యాన్ని పట్టించుకోకుండా నిర్మాణాలు జరిపారు. నిర్మాణాలు పూర్తయ్యాక సైతం లీజుకిచ్చేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. దీంతో కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనం వృథాగా మారిపోయింది.

అందుబాటులోకి తీసుకురావాలి

నిరుపయోగంగా ఉన్న మోడల్ మార్కెట్‌ను ప్రజల అవసరాల మేరకు అందుబాటులోకి తీసుకురావాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ జీహెచ్ఎంసీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఈ విషయమై జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కలిసి లేఖను అందజేశామని పేర్కొంటున్నారు. జోనల్ కమిషనర్‌తో పలుమార్లు చర్చించినట్లు ఆమె తెలిపారు.

త్వరలోనే టెండర్లు ఆహ్వానిస్తాం...

నారాయణగూడలో ఏర్పాటు చేసిన మోడల్ మార్కెట్‌కు త్వరలోనే టెండర్లు ఆహ్వానిస్తామని జీహెచ్ఎంసీ అంబర్‌పేట సర్కిల్ డీఎంసీ మారుతీదివాకర్ తెలిపారు. మార్కెట్ ప్రారంభోత్సవానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు.



రోడ్లపైనే వ్యాపారం.. ట్రాఫిక్‌తో సతమతం

మోడల్ మార్కెట్ ప్రారంభానికి నోచుకోకపోవడంతో అక్కడి వ్యాపారులు రోడ్లపైనే తమ వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. నారాయణగూడ చౌరస్తాలోనే మార్కెట్ ఉండటంతో సిగ్నల్ పడిన సమయంలో పూర్తి ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. కనీసం నడవడానికి కూడా పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. మార్కెట్‌కు అనుకుని రెండువైపులా ప్రధాన రాహదారి ఉంది. రోడ్డుకు ఇరువైపులా వ్యాపారాలు కొనసాగుతున్నాయి.

మరో గ్రంథాలయ ఉద్యమానికి శ్రీకారం చుట్టాలి

రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ డా. రియాజ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో మరో గ్రంథాలయ ఉద్యమానికి మార్గానికి శ్రీకారం చుట్టాలని రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ రియాజ్ అన్నారు. ప్రపంచ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రంథాలయ ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి సోమవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కు నుంచి చిక్కడపల్లిలోని సిటీ సెంటర్ లైబ్రరీ వరకు 'పుస్తకాలతో నడక'కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డా. రియాజ్ మాట్లాడుతూ... అక్షరం ఒంటరిగా ఉన్న మనిషికి ప్రపంచాన్ని పరిచయం చేస్తుందని అన్నారు. ప్రపంచాన్ని పరిచయం చేసుకున్న మనిషి నూతన నాగరికత దిశకు నడిపిస్తారని తెలిపారు. అక్షరాస్యతను పెంచడానికి పుస్తకాలను బాగా చదివే అలవాటు పెంచుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ ఉద్యమ ఫలితంగానే అక్షరాస్యత పెరిగిందని తెలిపారు. ప్రజాపాలన స్థాపన, నియంతృత్వ పాలన అంతానికి గ్రంథాలయ ఉద్యమం దారి చూపుతుందని చెప్పారు. పుస్తకాలను పాఠకులకు మరింత చెరువ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సినీ దర్శకుడు నర్సింగరావు, రచయిత వేణుగోపాల్, కవి యాకుబ్, చిత్రం శ్రీధర్, ప్రభాకర్, విజయలక్ష్మి ,రవికుమార్ పాల్గొన్నారు.



సుందరయ్య పార్కు నుంచి సిటీ సెంట్రల్ లైబ్రరీ వరకు సాగిన 'పుస్తకాలతో నడక'లో డా. రియాజ్

ఆలయాల అభివృద్ధికి సహకారం అందిస్తా

చిక్కడపల్లి: ఆలయాల అభివృద్ధికి సహరారం అందిస్తానని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. అనంతరం సోమవారం ఉదయం చిక్కడపల్లి శ్రీఆంజనేయస్వామి ఆలయంలో సంప్రోక్షణ, శుద్ధి అనంతరం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం పునర్ నిర్మాణంలో సహకరించిన దాతలను ఆయన అభినందించారు. యువతలో భక్తిభావం పెంచడానికి ఆలయాలు ఎంతో దోహదపడుతాయని అన్నారు. ఈ పూజల్లో ఈఓ మాచర్ల దేవనాథం, బీఆర్ఎస్ నేతలు ముఠా నరేష్, ముచ్చకుర్తి ప్రభాకర్, కుమారస్వామి, పోతుల శ్రీకాంత్, కాంగ్రెస్ నేత వై.సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీగణపతి ఆలయంలో ముగిసిన నవరాత్రి మహోత్సవాలు

ఆర్టీసీక్రాస్ రోడ్డులోని శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో వినాయక చవితి నవరాత్రి మహోత్సవాలు సోమవారం ముగిశాయి. సోమవారం చివరి రోజు కావడంతో భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ లక్ష్మారెడ్డి, చైర్మన్ నర్సింగ్‌రావు, సభ్యులు గుండ్ల గజానంద్, బండారు నవీన్, గుర్రం దినేష్, అర్చకులు గోపాలాచార్యులు, బుచ్చమాచార్యులు, జగన్మోహనాచార్యులు, రామాచారి, నరసింహమూర్తి పాల్గొన్నారు.

వీడిన గ్రహణం.. తెరుచుకున్న ఆలయాలు

నల్లకుంట: చంద్ర గ్రహణం అనంతరం సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం ఆలయాలు తెరుచుకున్నారు. అంబర్‌పేట నియోజకవర్గంలోని ఆలయాల్లో సుప్రభాత సేవను ఏకాంతంగా నిర్వహించిన అనంతరం ఇష్టదైవాల దర్శనానికి భక్తులకు అనుమతించారు. భక్తులు వేకువజామునే తల స్నానాలు ఆచరించి ఆలయాలకు చేరుకుని పూజలు చేశారు.

బాలరాజు కుటుంబాన్ని ఆదుకోవడం అభినందనీయం

పీటీసీ ప్రిన్సిపల్ పరవస్తు మధుకర్‌స్వామి

అంబర్‌పేట: నిత్యం తమ ముందు పనిచేసే వ్యక్తి అకస్మికంగా మృతి చెందిన అతడి కుటుంబాన్ని ఆదుకోవడం అభినందనీయమని పీటీసీ ప్రిన్సిపల్ పరవస్తు మధుకర్‌స్వామి అన్నారు. అంబర్‌పేట పీటీసీలో టీకొట్టు నడిపే బాలరాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ప్రిన్సిపల్ అతడి కుటుంబాన్ని ఆదుకోవడానికి పీటీసీ ఉద్యోగులు ముందుకు రావాలని కోరారు. దీంతో ఉద్యోగులు తమ వేతనం నుంచి రూ.1,80,000 జమ చేశారు. ఉద్యోగులు జమ చేసిన డబ్బులను సోమవారం పీటీసీ ఆవరణలో బాలరాజు కుటుంబ సభ్యులకు ఆయన అందజేశారు. అతడి కుమార్తెల పేరిట ఫిక్స్ డిపాజిట్ చేసి పత్రాలను అందజేశారు.



టీకొట్టు బాలరాజు కుటుంబ సభ్యులకు ఫిక్స్ డిపాజిట్ పత్రాలను అందజేస్తున్న ఉద్యోగులు

ఘనంగా కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జయంతి

చిక్కడపల్లి: విశ్వనాథ సత్యనారాయణ సాహిత్య చరిత్రలో శిఖర సమానులని తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నాలేశ్వరం శంకరం అన్నారు. సోమవారం సాయంత్రం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ నిర్వహణలో గుండవరపు హనుమంతరావు కళా వేదికలో నిర్వహించిన రచయిత, కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జయంతిలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. విశ్వనాథ రచించిన వేయి పడగలు సుదీర్ఘ నవల నాటి సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితులను ప్రతిబింబిస్తుందన్నారు. ప్రొ. శ్రీదేవి మాట్లాడుతూ... విశ్వనాథ సత్యనారాయణ కవి, కథకుడు, నవలా రచయిత, ఉత్తమ ఉపన్యాసకుడని కొనియాడారు. త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళా జనార్దనామూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖులు చక్రపాణి, శంకరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులను ప్రోత్సహిస్తే రాణిస్తారు

చిక్కడపల్లి: ప్రతిభా సామర్థ్యాలున్న కళాకారులను కళా సంస్థలతో పాటు ప్రభుత్వం గుర్తించి ప్రోత్సహిస్తే వారు మరింతగా రాణిస్తారని వంశీ అధినేత వంశీ రామరాజు అన్నారు. పద్మ భూషణ్ పి.భానుమతి రామకృష్ణ జయంతి సందర్భంగా సోమవారం త్యాగరాయ గానసభలో వంశీ భానుమతి గ్లోబల్ మ్యూజిక్ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ గాయని పాల్వంచ అనురాధకు వంశీ రామరాజు అవార్డును ప్రదానం చేసి సన్మానించారు. తొలుత భానుమతి పాటకు పట్టాభిషేకం శీర్షికతో నిర్వహించిన చిత్రగీత విభావరి అలరించింది. ఈ కార్యక్రమంలో ప్రముఖులు దైవజ్ఞశర్మ, వైఎస్ రామకృష్ణ, ప్రభాకర్, రేవతి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో చాపకింద నీరులా డ్రగ్స్ దందా



రాంనగర్ చౌరస్తాలో నిరసన చేపడుతున్న పీవైఎల్ నాయకులు

ముషీరాబాద్: చాప కింద నీరులా వ్యాపిస్తున్న డ్రగ్స్ దందా రూ.12వేల కోట్ల మాఫీయాగా ఎదుగుతుంటే డ్రగ్స్ నిర్మూలన కోసమే ఏర్పడిన ఈగల్, నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ వంటి సంస్థలు ఏమి చేస్తున్నాయని ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ (పీవైఎల్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.రవికుమార్ ప్రశ్నించారు. ఇటీవల చర్లపల్లి ఇండస్ట్రీయల్ ఏరియాలో రూ.వేల కోట్ల విలువ చేసే డ్రగ్స్, సంబంధిత కెమికల్స్ పట్టుబడిన నేపథ్యంలో రాంనగర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. చర్లపల్లిలో వాగ్దేవి ల్యాబ్ యాజమాన్యాన్ని, ప్రధాన నిందితుడు శ్రీనివాస్, విజయ్ ఓలేటి, తానాజీ పట్వారీ తదితరులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అనుమతి లేని కెమికల్ ఫ్యాక్టరీస్, ఇతర కంపెనీలపై దృష్టి పెట్టాలన్నారు. అనుమతి లేని ఫ్యాక్టరీ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్ష, కార్యదర్శులు బీఎస్ కృష్ణ, కొల్లూరు భీమేష్, నాయకులు కిరణ్, రాజు, రాంబాబు, చంద్రశేఖర్, రాజు, జయప్రసాద్, రాము, నాగయ్య, నరస్సింహ, ఆంజనేయులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి జలాభిషేకం



ముషీరాబాద్ చౌరస్తాలో జలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ముషీరాబాద్: కాళేశ్వరం వల్లే రిజర్వాయర్లలో నీటిని నింపి ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని భోలక్‌పూర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్ రావు అన్నారు. సోమవారం ముషీరాబాద్ చౌరస్తాలో ఆయన కేసీఆర్ చిత్రపటానికి జలాభిషేకం చేశారు. కాంగ్రెస్ మంత్రులు కాళేశ్వరం కూలేశ్వరం అన్నవారే కేసీఆర్ కట్టించిన కాళేశ్వరంపై ఆధారపడ్డారని పేర్కొన్నారు. నగర తాగునీటి అవసరాలకు ఈ నీటిని వినియోగించుకునేందుకు గండిపేట వద్ద సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయడం కాళేశ్వరం ప్రాజెక్టు ఎంతో అవసరమో తేటతెల్లం అయిందన్నారు. ఇప్పటికైనా కాళేశ్వరంపై తప్పుడు ప్రచారం మానుకుని ప్రజా సమస్యలను పరిష్కరించాలని హితువు పలికారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు డి.శివముదిరాజ్, డివిజన్ మాజీ అధ్యక్షుడు మహ్మద్ ఆలీ, వంగాల నర్సింగ్‌రావు, పార్టీ నాయకులు జావేద్‌ఖాన్, ప్రవీణ్, మనోహర్, కె.ఎం.సాయి, ఆజాపాషా, సైఫోద్దీన్, సుమన్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా రమేష్



మంజాల రమేష్‌కు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న జాతీయ అధ్యక్షుడు వేముల లక్ష్మణ్

కాచిగూడ: అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం (ఏబీవీఎస్) తెలంగాణ అధ్యక్షుడిగా మంజాల రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జాతీయ అధ్యక్షులు వేముల లక్ష్మణ్, జాతీయ ప్రధానకార్యదర్శి గుంజ శ్రీనివాస్ ప్రకటించారు. ఈ మేరకు వారు మాంజాల రమేష్‌కు ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. కాచిగూడలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో సోమవారం రాష్ట్ర సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వేముల లక్ష్మణ్ మాట్లాడుతూ ఓబీసీలలో అత్యంత వెనుకబడిన వడ్డెర సామాజిక వర్గం ఎదుర్కొంటున్న అనేక సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేయాలని అన్నారు. గుంజ శ్రీనివాస్ మాట్లాడుతూ మన ముందున్న ప్రధాన డిమాండ్లు వడ్డెర సామాజిక వర్గాన్ని ఎస్టీ జాబితాలో చేర్చడం, రాష్ట్రంలో వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో జాతీయ మహిళా అధ్యక్షురాలు వేముల తిరుమల దేవి, రేసాని కాశీనాథ్, డాన్ శ్రీను, సంపంగి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న రాజపేట చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఆర్.ఆంజనేయులు

అంబర్‌పేట: మెరుగైన సమాజ నిర్మాణానికి ఉపాధ్యాయుల పాత్ర కీలకమని అంబర్‌పేట పోలీస్ శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ పరవస్తు మధుకర్‌స్వామి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని పీటీసీ ఆవరణలో పలు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను సోమవారం ఆయన సత్కరించారు. అలాగే విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు, జామెట్రీ బాక్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పీటీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. చదువుకోవాలని విద్యార్థుకు సూచించారు.



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పీటీసీ ప్రిన్సిపల్ మధుకర్‌స్వామి

ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో...

ముషీరాబాద్: విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దే వారే గురువులని రాజపేట చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఆర్.ఆంజనేయులు పేర్కొన్నారు. సోమవారం ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో టీచర్స్ డేను పురస్కరించుకొని ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానించి, బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, విద్యామండలి డిప్యూటీ ఐవోస్ స్వరూపారాణి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, పద్మావతి, రఘునందన్, కొండల్‌రెడ్డి, సహనాకౌసర్, ఉషా, అబ్దుల్లా, సునిత తదితరులు పాల్గొన్నారు.

స్నేహితులే హతమార్చారు..

మూసీ నదిలో గుర్తుతెలియని వ్యక్తి హత్య కేసును ఛేదించిన పోలీసులు



కేసు వివరాలను వెల్లడిస్తున్న ఈస్ట్ జోన్ డీసీపీ డా. బాలస్వామి

అంబర్‌పేట: మూసీ నదిలో గుర్తుతెలియని వ్యక్తి హత్య కేసును పోలీసులు ఛేదించారు. తెలిసిన స్నేహితులే అతడి హత్య చేశారని పోలీసులు తేల్చారు. సోమవారం ఈస్ట్‌జోన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీసీపీ డాక్టర్ బాలస్వామి దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. బిహార్ రాష్ట్రానికి చెందిన మహ్మద్ జావీద్, మహ్మద్ అమీరుల్ హాక్, షోరబ్ (30) ముగ్గురు స్నేహితులు. ముగ్గురు కలిసి కొంత కాలం క్రితం హైదరాబాద్‌కు వచ్చి ఉప్పల్ ద్వారకనగర్‌లో నివాసం ఉంటూ ఫాల్ సీలింగ్ వర్క్ చేస్తున్నారు. అయితే సొరబ్ తన స్నేహితుడైన జావీద్ భార్య ముస్కాన్‌పై కన్నేసి తరచూ వేధిస్తున్నాడు.

భార్యను వేధిస్తున్నాడని మందలించినా...

ఈ విషయం తెలుసుకున్న జావేద్ పలుమార్లు షోరబ్‌ను మందలించిన అతను వినిపించుకోలేదు. దీంతో జావేద తన భార్యను తీసుకొని గది ఖాళీ చేసి వెళ్లిపోయి మరో స్నేహితుడైన అమిరుల్ హక్ ఇంటి పక్కన మరో ఇంటిలో అద్దెకుంటున్నాడు. అయినప్పటికీ షోరబ్ జావీద్ భార్య వెంటపడి వేధిస్తున్నాడు. దీంతో ఎలాగైనా అడ్డు తొలగించాలని భావించిన జావేద్ తన స్నేహితుడైన అమిరుల్ హక్‌తో కలిసి పథకం పన్నాడు.

మూసీ ఒడ్డున మద్యం సేవించనానంతరం..

ఈ పథకంలో భాగంగా ఆగస్టు 20వ తేదీన జావీద్, అమీర్ హక్ ఇద్దరు కలిసి షోరబ్‌ను ఆలీకేఫ్ సమీపంలోని మూసీనది ఒడ్డుకు తీసుకువచ్చి అక్కడ ముగ్గురు కలిసి మద్యం సేవించారు. ఈ క్రమంలోనే మద్యం తాగిన షోరబ్ గొంతును ఇద్దరు కలిసి వైరుతో బిగించి హ్యత చేసి అక్కడి నుంచి పారిపోయారు. మరుసటి రోజు ఉదయం షోరబ్ మృతదేహాన్ని చూసిన స్థానికులు అంబర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

◆ ఈ మేరకు కేసు నమోదు చేసిన ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ హాఫీస్‌లు ర్యత్యేక బృందాలతో అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల దర్యాప్తులో షోరబ్‌ను మహ్మద్ జావిద్ (27), మహ్మద్ అమీదరుల్ హాక్ (27) హత్య చేసినట్లు గుర్తించి సోమవారం వారిని అరెస్ట్ చేశారు.